

అభివృద్ధిపై కక్షసాధింపా?

చేసిన అభివృద్ధిపై కక్షసాధింపు చర్యలకు దిగడం సమంజసం కాదని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హితవు పలికారు. - 8లో



బయోస్టాటిస్టిక్స్‌ది..

మెడికల్, నర్సరీ విభాగాల్లో బయోస్టాటిస్టిక్స్‌ది ప్రధాన భూమిక అని కోలార్ ఎస్‌డీయూఆర్‌టీ వీసీ డాక్టర్ వెంగమ్మ తెలిపారు. - 8లో



గరుడ వాహనంపై అభయం

శ్రీసుందరరాజ స్వామి అవతారోత్సవాల్లో భాగంగా స్వామివారు గరుడ వాహనంపై ఊరేగుతూ కనువిందు చేశారు. - 8లో



పేదల ఆశల సౌధం ఆగిపోయింది. గృహనిర్మాణాలు పూర్తవుతాయో లేదోనన్న ఆందోళన మొదలైంది. కూటమి ప్రభుత్వం గత 25 రోజులుగా బిల్లుల చెల్లింపును నిర్దాక్షిణ్యంగా ఆపేసింది. మొండి గోడలతో దర్శనమిస్తున్న ఇళ్లను చూసి లబ్ధిదారులు కన్నీళ్లు పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది. మరో వైపు పచ్చమూకల కబ్జాకోరుకు బలవుతామోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆగిన ఆశల సౌధం!

- జిల్లాలో పక్కాగృహాల నిర్మాణానికి బ్రేక్
- పేదల గూడుపై కక్షగట్టిన కూటమి ప్రభుత్వం
- బిల్లుల చెల్లింపునకూ మోకాలడ్డు
- సిమెంట్ లెక్కల్లో అధికారులు బిజీబిజీ
- వెబ్‌సైట్‌లో పలు మార్పులు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

తిరుపతి అర్బన్: జిల్లాలో 571 కొత్త కాలనీల్లో 72,436 మంది పేదలకు గత ప్రభుత్వ హయాంలో అధికారులు ఇళ్లు కేటాయించారు. జూన్ 3వ తేదీకి జిల్లాలో 29,231 ఇళ్లు పూర్తికారు. మిగిలిన 43,205 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో ఈనెల 4వ తేదీ నుంచి నిర్మాణాలకు బ్రేక్ పడ్డాయి. వెబ్‌సైట్‌లో మార్పులు చేయాలంటూ బిల్లులు నిలుపుదల చేయడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు అధికారులకు స్పష్టమైన సంకేతాలు అందలేదు.

గత ప్రభుత్వంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా జిల్లాలోని పేదలకు పక్కాగృహాలు మంజూరు చేసింది. మొత్తం 72,436 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణాలు చేపట్టింది. గృహ నిర్మాణశాఖ రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేసింది. ఒక్కో ఇంటికి రూ.1.8 లక్షలు అందించింది. అంతేకాకుండా మహిళా సంఘాల నిధులు, బ్యాంకుల ద్వారా ఒక్కో లబ్ధిదారునికి రూ.35 వేల రుణం మంజూరు చేయించింది. అలాగే తక్కువ వ్యయంతో నాణ్యమైన ఇంటి సామగ్రిని సరఫరా చేసింది. లబ్ధిదారు చెల్లించే యూనిట్ విలువలో ఈ సామగ్రి విలువను మినహాయించారు. సిమెంట్ కూడా తక్కువ ధరకే అందించింది. జిల్లా వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలకు రూ.821 కోట్లు వెచ్చించింది. అయితే ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న వచ్చినప్పటికీ ఇంటి నిర్మాణాలకు బ్రేక్ పడలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో సిమెంటు లెక్కలు సరిగా లేవంటూ నిర్మాణాలకు మెలిక పెట్టింది.


జిల్లా సమాచారం	
మొత్తం ఇళ్లు	72,436
పూర్తయిన ఇళ్లు	29,231
బేసిమెంట్ లెవల్‌లో ఉన్నవి	16,652
రూఫ్‌లెవల్‌లో	10,278
స్లాబ్‌లెవల్‌లో	9,439
ప్రారంభం కానివి	6,836

వెబ్‌సైట్‌లో మార్పులు

గత ప్రభుత్వం వినియోగించిన గృహ నిర్మాణశాఖ వెబ్‌సైట్ లాగిన్‌ను ప్రస్తుత ప్రభుత్వం లాక్ చేసింది. నిర్మాణాలు పూర్తి చేసుకున్న గృహాల వివరాల నమోదుకు ఆస్కారం లేకుండా పోయింది. ప్రతి వారం చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపునకూ అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు.



తొండవాడ లేఅవుట్‌లో ఆగిన నిర్మాణాలు



ఎం.కొత్తపల్లి లేఅవుట్‌లో ఆగిపోయిన పక్కాగృహాల నిర్మాణ పనులు

జూలైలో గృహ ప్రవేశం అనుకున్నాం

నవరత్నాల్లో భాగంగా అందరికీ ఇళ్లు పథకంలో ఇంటిపట్టాతోపాటు మాకు శ్రీకాళహస్తి మండలం, ఊరందూరు లేఅవుట్‌లో ఇంటిని మంజూరు చేశారు. ఆ ఇంటి నిర్మాణం తుది దశలో ఉంది. జూన్ 30వ తేదీకి ఇల్లు నిర్మాణం పూర్తవుతుందని భావించాం. జూలైలో గృహ ప్రవేశం చేయడానికి సిద్ధమవుతున్నాం. అయితే జూన్ 4వ తేదీ నుంచి కొత్త ప్రభుత్వం రావడంతో ఇంటి నిర్మాణాలను నిలుపుదల చేసింది. మా ఇంటిని పూర్తి చేయడం ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి వారం ఎంత మేరకు పనులు చేశారు అనే లెక్కలు హౌసింగ్ అధికారులు చూసేవారు. ఇప్పుడు చూడడం లేదు. లాగిన్ లాక్ చేశారని, వెబ్‌సైట్‌లో మార్పులు అంటున్నారు. మాకు ఆ విషయాలు తెలియవు. మా ఇంటిని పూర్తి చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరుతున్నాం. –మునిక్రిష్ణయ్య, శ్రీకాళహస్తి

నిబంధనలు మారాయి అంట!

నెల రోజులుగా ఇంటి నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. రేణిగుంట మండలంలోని జీపాళెం లేఅవుట్‌లో ఇంటిని మంజూరు చేశారు. ఆ మేరకు జోరుగా ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో నిబంధనలు మారాయి అంటున్నారు. మేము ఏ పార్టీకి చెందిన వాళ్లంకాదు. ఏళ్ల తరబడి తిరుపతి నగరంలో కూలి పనులు చేసుకుంటున్నాం. మాకు గత ప్రభుత్వం రేణిగుంటలోని జీపాళెంలో ఇల్లు మంజూరు చేసింది. మా ఇంటిని నిర్మించుకోవడానికి అధికారులు అండగా ఉండాలని కోరుతున్నాం. –సుబ్బమ్మ, తిరుపతి అర్బన్

వివరాలు నమోదు చేయడం లేదు



హౌసింగ్ లాగిన్ లాక్ చేశారు. ఇంటి నిర్మాణాల వివరాలను నమోదు చేయడం లేదు. అంతే కాకుండా ప్రస్తుతం ప్రభుత్వం హౌసింగ్ వెబ్‌సైట్‌లో మార్పులు చేస్తోంది. వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తేనే తదుపరి చర్యలు చేపడుతాం. మరోవైపు జిల్లాలో గృహ నిర్మాణాలకు వినియోగించిన సిమెంట్ వివరాలపై ఆడిట్ జరుగుతోంది. – వెంకటేశ్వర్లు, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి

న్యూస్‌రీల్

మెనూ తప్పనిసరి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్

చిల్లకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ తెలిపారు. ఆయన శనివారం పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడారు. జిల్లాలో 7,668 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, ఒక్కో ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే 300 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఐఎఫ్‌పీ ప్యానల్‌ను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. అలాగే బైజూస్ ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన చేయాలన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారులు సనత్‌కుమార్, ఎండీ రఫూఫ్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చంద్ర, శివసుబ్రహ్మణ్యం, గ్రందం మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, వీవీ కుమార్ ఉన్నారు.

బంగారు తిరుచ్చిపై చిద్విలాసం



బంగారు తిరుచ్చిపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండుగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

గత ప్రభుత్వంలో 966 దుప్పట్లు అదనం



చెన్నయ్య, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్: గత ప్రభుత్వంలో ఎస్సీ హాస్టల్స్ విద్యార్థుల సంఖ్య కన్నా అదనంగా 966 దుప్పట్లు ఇచ్చారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య తెలిపారు. దుప్పట్లు అందక విద్యార్థులు గాలీవానకు వణికిపోతున్నారంటూ శనివారం సాక్షి దినపత్రికలో 'హాస్టల్ విద్యార్థులు గజగజ' శీర్షికన వార్త వెలువడింది. దీనిపై సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి చెన్నయ్య స్పందించారు. గత ప్రభుత్వంలో 966 దుప్పట్లు అదనంగా ఇచ్చారని, వాటిని పిల్లలకు ఈ ఏడాది పంపిణీ చేశామని చెప్పారు. ఈ ఏడాదికి సంబంధించి ఇంకా దుప్పట్లు రాలేదని, వచ్చిన వెంటనే మిగిలిన వారికి పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

కెరీర్‌పై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ బయోమెడికల్ రీసెర్చ్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ అకడమిక్ కెరీర్ డెవలప్‌మెంట్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యూఎస్‌ఏ అట్లాంటాలోని మోర్ హౌస్ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ డాక్టర్ కామేశ్వరరావు బద్రి విచ్చేసి పలు అంశాలపై అవగాహన కల్పించారు. మాస్టర్, డాక్టర్స్ ప్రోగ్రామ్స్‌ను యూఎస్‌ఏలో చేయడానికి గల అవకాశాలు, బయోమెడికల్‌లో జరుగుతున్న అడ్వాన్స్ రీసెర్చ్ గురించి వివరించారు. ప్రొఫెసర్లు ఆర్ ఉష, జాన్ సుష్మా, ఇందిరా, మాధవి, శిరీష, సుజాత, రమేష్‌బాబు పాల్గొన్నారు.

287 కేసుల పరిష్కారం

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 287 కేసులు పరిష్కారించినట్టు తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ గురునాథ్ తెలిపారు. పరిష్కారమైన కేసుల్లో 190 క్రిమినల్ కేసులు ఉన్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. కేసుల పరిష్కారం కోసం ఈ లోక్ అదాలత్‌లో 8 బెంచ్‌లను ఏర్పాటు చేసినట్టు న్యాయమూర్తి తెలిపారు. తనతో పాటు తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి అర్చన, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి విజయసారథి రాజు, జూనియర్ సివిల్ జడ్జిలు సత్య కాంత్‌కుమార్, కోటేశ్వరరావు, సంధ్యారాణి, శ్రీనివాస్, వై.సరిత అధ్యక్షులుగా వ్యవహరించినట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ, న్యాయవాదులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి గురునాథ్

కార్మికుల భద్రతే లక్ష్యం

- నేడు మైకా భద్రతావారోత్సవాల ముగింపు కార్యక్రమం



మైకాగనిలో కార్మికులు

సైదాపురం: 50వ నెల్లూరు మైకా జిల్లా భద్రతావారోత్సవాల ముగింపు సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ మైన్స్ సేఫ్టీ సౌత్‌జోన్ అధికారి భూషణ్‌ప్రసాద్ సింగ్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ అధికారి పెద్దిరెడ్డి రఘుపతి, అధ్యక్షులుగా ద్వారకనాథరెడ్డి పాల్గొననున్నట్టు వారోత్సవాల కన్వీనర్ గోగినేని భరత్ తెలిపారు. ఒకేషనల్ ట్రెనింగ్ సెంటర్ భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సైదాపురం పంచాయతీ పరిధిలోని దాడిశెట్టిపల్లి గ్రామ సమీపంలో నూతన భవనిర్మాణం చేయనున్నట్టు వెల్లడించారు.

రేపటి నుంచి అరణియార్‌లో చేపల వేట నిషేధం

నాగలాపురం: పిచ్చాటూరులో ఉన్న అరణియార్ రిజర్వాయర్‌లో జూలై 1 నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు చేపల వేటను నిషేధిస్తున్నట్టు తిరుపతి జిల్లా మత్స్యశాఖ అధికారి ఎ.నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జూలై ప్రారంభం నుంచి ఆగస్టు వరకు అరణియార్‌లో మంచి నీటి చేపల సంతానోత్పత్తి జరుగుతుందని, మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లరాదని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధిపై కక్షసాధింపా?

- సచివాలయాలపై పేర్లు తొలగింపు నీచమైన చర్య
- బాధ్యులపై చర్యలకు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- అభివృద్ధి పనులకు పాలకుల పేర్లు పెట్టుకోవడం ఆనవాయితీ
- కొత్త సంప్రదాయాన్ని ప్రజలు సహించరు
- ధ్వంసమైన గ్రామ సచివాలయాల సందర్శనలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి


సప్తగిరినగర్ సచివాలయాన్ని పరిశీలించి అక్కడి నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి


వేదాంతపురం పంచాయతీని సందర్శించిన అనంతరం స్థానికులతో చర్చిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

చంద్రగిరి: ప్రజలు ఇచ్చిన అధికారంతో గెలిచిన శాసనసభ్యుడు తన శక్తి మేరకు అభివృద్ధి పనులు పూర్తి చేస్తారు. ఆ పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలపై తన పేరు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇదే ఆనవాయితీ కొనసాగుతోంది. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన తర్వాత వారు చేసిన అభివృద్ధి పనులకు సూచికగా వారి పేరు పెట్టుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు. అలా కాకుండా గత పాలకులు చేసిన అభివృద్ధి పనులపై వేసుకున్న పేర్లను కొత్తగా ఎన్నికైన వారు చెరిపివేయడం, పగులగొట్టడం వంటి పనులు చేయడం రాజ్యాంగ విరుద్ధం. చట్ట వ్యతిరేకం. ఈ సంస్కృతిని భవిష్యత్తు తరాలకు అందించడం కూడా మంచిది కాదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం కూడా గత పాలకుల ఫొటోలను తొలగించి కొత్త వారి ఫొటోలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులిచ్చిందే తప్ప గత పాలకులు చేసిన అభివృద్ధి పనుల శిలాఫలకాలు, ప్రారంభోత్సవాల బోర్డులను తొలగించమని ఎక్కడా చెప్పలేదు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం, పేర్లు తొలగించడం వంటి చర్యలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. అలా స్పందించని వారిని న్యాయస్థానంలో నిలబెడతాం' అంటూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల పరిధిలోని గ్రామ సచివాలయాలపై పేర్లు తొలగించిన భవనాలను చెవిరెడ్డి శనివారం సందర్శించారు. ముందుగా తిరుపతి రూరల్ మండల పరిధిలోని సప్తగిరి కాలనీ, వేదాంతపురం, సి.మల్లవరం గ్రామ సచివాలయాలను సందర్శించారు. ఆ తర్వాత చంద్రగిరి మండలంలోని దోర్నకంబాల గ్రామ సచివాలయం, గంగుడుపల్లి రైతు భరోసా కేంద్రాలను పరిశీలించారు. చెవిరెడ్డి రాకతో స్థానికంగా ఉంటున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. గత 25 రోజులుగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన దౌర్జన్యాలు, విధ్వంసాలను ఏకరవుపెట్టారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ పార్టీ కార్యకర్తలపై


సి.మల్లవరం సచివాలయం వద్ద..


చంద్రగిరి మండలం దోర్నకంబాలలో..

దాడులు చేసి భయానక వాతావరణం కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారందరికీ ధైర్యం చెప్పిన చెవిరెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. చేసిన అభివృద్ధి పనులకు పెట్టుకున్న బోర్డులను ధ్వంసం చేసే హక్కు ఎవ్వరికీ లేదన్నారు. ఈ విషయంలో అధికారులు, పోలీసులు స్పందించకుంటే ప్రజలే తిరగబడతారన్నారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన్న వారిపై సంబంధిత అధికారులు స్పందించని పక్షంలో పేర్లు తొలగించిన వ్యక్తులు, తొలగింపునకు ప్రేరేపించిన వారితో పాటు ఆయా పంచాయతీల అధికారులపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకునేలా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెవిరెడ్డి హెచ్చరించారు. కనీసం పదేళ్ల పాటు కోర్టుల చుట్టూ తిరిగేలా చేస్తామన్నారు. కక్ష సాధింపులతో చేసే పాలనను ప్రజలు క్షమించరని ఆయన స్పష్టం చేశారు.

అభివృద్ధి చేసి పేర్లు పెట్టుకోండి

గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో చంద్రగిరి నియోజకవర్గంలో రూ.958 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తిచేశామని, ఆ పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల శిలాఫలకాల్లోని పేర్లను తొలగించడం కంటే ప్రజలు ఇచ్చిన అధికారంతో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు మరింతగా అభివృద్ధి చేసి వారి పేర్లు కూడా పెట్టుకోవచ్చని చెవిరెడ్డి హితవు పలికారు. అలా కాకుండా ప్రజలకు సౌకర్యవంతంగా పూర్తి చేసిన పనులకు సంబంధించిన బోర్డులు విరిచేస్తాం, పేర్లు తొలగిస్తామంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు.

బయోస్టాటిస్టిక్స్‌ది ప్రధాన భూమిక

తిరుపతి సిటీ: మెడికల్, సర్జరీ విభాగాల్లో బయోస్టాటిస్టిక్స్ ప్రధాన భూమిక పోషిస్తోందని స్విమ్స్ మాజీ డైరెక్టర్, కోలార్ ఎస్‌డీయూఆర్‌టీ వీసీ డాక్టర్ బీ.వెంగమ్మ తెలిపారు. శనివారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ లైబ్రరీలో భారతీయ గణాంకశాస్త్ర పితామహుడు మహలనోబిస్ 132వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బయోస్టాటిస్టిక్స్‌లో ట్రెండ్స్ అండ్ ఛాలెంజెస్ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో స్టాటిస్టిక్స్‌ను కాపాడుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందన్నారు. వెటర్నరీ సైన్స్ డీన్ డాక్టర్ కేవీ బ్రహ్మయ్య పరిశోధనలో డేటా ప్రాముఖ్యతను వివరించారు. స్విమ్స్ డీన్ అల్లాడి మోహన్, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబులిటీ అండ్ స్టాటిస్టిక్స్ గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ రాజేంద్రన్, విశ్వనాథన్, డాక్టర్ శ్రీనివాసులు, నవీన్, చైతన్యకుమార్, స్రవంతి, కుట్టికుమార్, రాంబాబు నాయక్, సుధీర్, హేమంత్, సుకీర్తి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై అభయం

ముగిసిన అవతార మహోత్సవాలు



చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీ సుందరరాజ స్వామివారు శనివారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో శ్రీ సుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీకృష్ణస్వామివారి ముఖమండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం ప్రతిభ


11వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : నవోదయ విద్యాసంస్థలో 2024–25విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ ఫలితాల్లో ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ సీట్లు సాధించినట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వీరితో పాటు 6, 9వ తరగతుల్లో కలిపి మొత్తం 48మంది ఈ ఏడాది నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించడం తమకు గర్వకారణమని తెలిపారు.